# టెట్ ఫీజును వెంటనే తగ్గించాలి

- బీఆర్‌ఎస్‌వీ, ఎస్ఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన

కొల్లాపూర్, మార్చి 26: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఫీజును ప్రభుత్వం రూ.వెయ్యికి పెంచడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్‌వీ, స్వేరో స్టూడెంట్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని పీజీ కాలేజీ ఎదుట విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకుడు శేఖర్, ఎస్ఎస్‌యూ పాలమూరు యూనివర్సిటీ నాయకుడు దాస్ మాట్లాడుతూ 2011 నుంచి 2021 వరకు టెట్ పరీక్ష ఫీజు రూ.200లు మాత్రమే ఉందని, 2022లో రూ.300లు, 2023లో రూ.400లు ఫీజును పెంచారని పేర్కొన్నారు. 2024లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో టెట్ పరీక్ష ఫీజును ఏకంగా రూ.వెయ్యికి పెంచడం దుర్మార్గమని, పేద విద్యార్థులకు భారంగా మారిందని అన్నారు. వెంటనే పాతఫీజు విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శేఖర్, దాస్, పీజీ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.


కొల్లాపూర్ పీజీ కాలేజీ ఎదుట నినాదాలు చేస్తున్న విద్యార్థులు, నాయకులు


అచ్చంపేటలో నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్నసైదు లు

**అచ్చంపేటలో..**

అచ్చంపేటరూరల్, మార్చి 26: ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఫీజును వెంటనే తగ్గించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వర్దం సైదులు యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చెంచు పలుగుతండాలో నూతన కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ అధికారంలోకి వస్తే అధిక ఫీజులు లేకుండా పరీక్షలు నిర్వహిస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. వెంటనే ఫీజు తగ్గించకుంటే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మల్లేశ్, రామకృష్ణ, అశోక్, వినోద్, రామ్‌సింగ్, చరణ్, పర్వతాలు, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిశా ంతికుమారి

## నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి

- ఏప్రిల్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి
- కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

నాగర్‌కర్నూల్, మార్చి 26 : ప్రస్తుత వేసవి దృష్ట్యా గ్రామాలు, పట్టణాల్లో నీటి సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి, ఏప్రిల్ మొదటి వారంలోనే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. మంగళవారం అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యాసంగి ధాన్యం కొనుగోలు నిమిత్తం ధాన్యం కొనుగోలు, సీఎంఆర్ డెలివరీ, తాగునీటి ఎద్దడి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. యాసంగి పంట కోతలకు వస్తున్న నేపథ్యంలో జిల్లా స్థాయిలో వరికోతల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని నీటి సరఫరా, టెంట్లు, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు వంటివి ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో రైస్ మిల్లులకు రవాణా చేసేందుకు అవసరమైన వాహనాలను సిద్ధం చేసుకోవాలని, ధాన్యానికి మద్దతు ధర కల్పించాలన్నారు. రానున్న వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా జిల్లాలో కార్యచరణ చేపట్టాలని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాలో క్షేత్రస్థాయిలో నీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాలన్నారు. కలెక్టర్ ఉదయ్‌కుమార్, అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, సీతారామారావు, జిల్లా అధికారులు ఈ వీసీలో పాల్గొన్నారు.

**సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలి: కలెక్టర్**

అనంతరం కలెక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 10వ తేదీన కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ అధికారి స్వామికుమార్, మార్కెట్ అధికారి బాలమణి, అధికారులు ఉన్నారు.

## వట్టెం వెంకన్న సన్నిధిలో హోమాలు


పూజలు చేస్తున్నఅర్చకులు

బిజినేపల్లి, మార్చి 26: మండలంలోని వట్టెం గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం 5వరోజు బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. ఆలయంలో సేవాకాలం, హోమాలు, బాలభోగ నివేదన, పూర్ణాహుతి, అ లంకారం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, నర్సింహారెడ్డి, భక్తులు ఉన్నారు.

## నిబంధనల ప్రకారం దుకాణాలు నడపాలి


దుకాణాదారులతో మాట్లాడుతున్నడీ ఎండే వరాజు

- ఆర్టీసీ డీఎం దేవరాజు

బిజినేపల్లి, మార్చి 26: ఆర్టీసీ నిబంధనల ప్రకారమే అద్దె దుకాణాలు నడుపుకోవాలని నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో మేనేజర్ దేవరాజు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాలు టెండర్‌వేసే సమయంలో ఏ దుకాణాలను పొందు పరిచారో వాటినే నడుపుకోవాలని సూచించారు. అదేవిధంగా దుకాణాల ముందు ఇతర వ్యాపారాలు నడపవద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న దుకాణాలను వారం రోజుల్లోగా తొలగించాలని నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో సీఐ బాలసరస్వతి, చారి తదితరులున్నారు.

## వ్యక్తి ఆత్మహత్యా యత్నం

ఊర్కొండ, మార్చి 26 : అప్పులకు తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. ఎస్సై వీరాబాబు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు గ్రామానికి చెందిన దుర్గేష్ (50) అప్పులు చేయడంతో ఎలా తీర్చాలనే మనస్తాపానికి గురై మంగళవారం సాయంత్రం ఊర్కొండపేట శివారులోని గుట్టపై ఎడమచెయ్యి, గొంతు కోసుకున్నాడు. చుట్టుపక్కల పొలాలవారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే 108లో చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారని ఎస్సై తెలిపారు.

## బాధిత కుటుంబానికి బీరం ఆర్థిక సాయం

కొల్లాపూర్, మార్చి 26: మండలంలోని మాచినేనిపల్లి గ్రామపంచాయతీ పరిధి లోని మాధవరావుపేటలో అకస్మాత్తుగా మృతి చెందిన చిన్న బుజ్జమ్మ(50)కుటుంబాన్ని ఫోన్‌లో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగితెలుసుకున్నారు. కుటుంబానికి ఆయన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బీరం పంపిన రూ.5వేలు ఆర్థిక సాయాన్ని బీఆర్ఎస్ నాయకుడు తిరుపతయ్యగౌడ్ బాధిత కుటుంబానికి అందజేశారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలి

వంగూరు, మార్చి 26 : రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా నాయకుడు శివరాములు మంగళవారం ప్రకటనలో కోరారు. ధరణిలో పెండింగ్‌లో సమస్యలను పరిష్కరించడంతో పాటు కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణమాఫీ చేయడంతో పాటు రైతులకు రైతుబంధు అందించాలన్నారు. రైతుబీమాపై ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి ప్రకటన విడుదల చేయకపోవడం రైతులను మోసం చేయడమేనన్నారు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ రైతుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని సూచించారు.

## అంజన్న హుండీ లెక్కింపు

అమ్రాబాద్, మార్చి 26: పదర మండలంలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి హుండీలను లెక్కించినట్లు ఆలయ ఈ వో రంగాచారి మంగళవారం తెలిపారు. మూడు నెలలకు సంబంధించి, హుండీలో రూ.16లక్షల 9,351, అలాగే 1650 గ్రాముల మిశ్రమ వెండి ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, దేవాలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

తిమ్మాజిపేట, మార్చి 26: మండలంలోని బావాజీపూర్‌కు చెందిన ఓ యువతి(22) అదృశ్యమైనట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. మూడ్రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిన యువతి, తిరిగిరాలేదని, కుటుంబ సభ్యులు ఎంత వెతికినా జాడ లేకపోవడంతో, మంగళవారం తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. బిజినేపల్లికి చెందిన ఓ యువకుడిపై ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారని పేర్కొన్నారు.

# మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, మార్చి 26: జిల్లాకు సంబంధించి పార్లమెంట్ ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ సిబ్బందికి మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. మంగళవారం కలెక్టరేట్ ఎన్ఐసీ వీడియో సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, అలాగే జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని ఊర్కొండ మండల, శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 909 పోలింగ్ కేంద్రాలకు 20శాతం అదనంగా 4,552 మందిని మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేశామని తెలిపారు. అందులో 1,138 మంది పీవోలు, 1,138 మంది ఏపీవోలు, 2,276 మంది ఓపీవోలు ఉన్నారని తెలిపారు. ప్రతి టీమ్‌లో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు అదనపు పోలింగ్ ఆఫీసర్లు ఉంటారన్నారు. రిజర్వు టీమ్‌లకు శిక్షణ ఇచ్చి, హోమ్ ఓటింగ్‌కు ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, సీతారామారావు, ఏవో చంద్రశేఖర్, ఈడీఎం నరేశ్, ఎన్ఐసీ సిబ్బంది అర్షద్, శివ, మధు పాల్గొన్నారు.

**ఎన్నికల సామగ్రిని పరిశీలన**

పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఎన్నికల సామగ్రి, శిక్షణ కరదీపికలను ఎన్నికల నోడల్ అధికారులు గోపాల్‌నాయక్, కార్తీక్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి అమలు పరిచే విధంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి పోలింగ్ కేంద్రం పీవో వరకు అమలు పరచాల్సిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి, సువిధ అనుమతులు, నామినేషన్లు, ఎంసీసీ, ఎంసీఎంసీ, ఇతర అంశాల వారీగా కరదీపికలను వారు పరిశీలించారు. ఓటరు అవగాహన, ఓటరు మ్యాప్‌లు మండలాలకు చేరవేత అంశాలపై చర్చించారు. ఎన్నికల సందర్భంగా పాటించాల్సిన అన్ని నిబంధనలను పాటిస్తూ కలెక్టర్, కొత్తగా ఎన్నికల సంఘం జారీ చేసే సూచనలను సైతం దృష్టిలో ఉంచుకొని విధులు నిర్వహించేలా సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు మండల అధికారి గోపాల్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సూపరింటెండెంట్ యూసూఫ్, కలెక్టరేట్ సిబ్బంది నజీర్, బాలరాజు తదితరులు ఉన్నారు.


అధికారులకుఅవ గాహనకల్పి స్తున్నకలె క్టర్‌ఉ దయ్‌కుమార్

# తప్పుచే యనివారు పోలీసులకుభ యపడొద్దు


షీ టీంపై విద్యార్థులకుఅవ గాహనకల్పి స్తున్న అదనపు ఎస్పీ రామేశ్వర్

- మంచి చెడులను యువత గుర్తించాలి
- ఫ్రెండ్లీ పోలీస్.. షీ టీంపై డిగ్రీ విద్యార్థులకు అవగాహన
- అదనపు ఎస్పీ రామేశ్వర్

నాగర్‌కర్నూల్, మార్చి 26: బాధితులు పోలీసులకు భయపడవద్దని, తప్పు చేసిన వారిపై ఎలాంటి బెరుకు లేకుండా ఫిర్యాదు చేయాలని ఉమెన్ సేఫ్టీ వింగ్ అదనపు ఎస్పీ రామేశ్వర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని నెల్లికొండ చౌరస్తాలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో షీ టీంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంపై సూచనలు చేశారు. తప్పుచేసిన వారు మాత్రమే పోలీసులకు, చట్టానికి భయపడతారన్నారు. విద్యార్థులు మంచి భవిష్యత్ నిర్మించుకునే విధంగా సమాజంలో ఇటు అధ్యాపకులకు, అటు తల్లిదండ్రులకు మంచిపేరు ప్రఖ్యాతులు తేవాలన్నారు. సోషల్ మీడియా బారిన పడి యువత తప్పుదోవ పడుతుందని, దయచేసి ఏది మంచో.. ఏది చెడో తెలుసుకోవాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్ కోసం పాటుపడాలని చెప్పారు. మహిళలు, చిన్నారులు ఎలాంటి వేధింపులకు గురైనా సెల్ నెంబర్ 87126 57676 లేదా డయల్ 100కు కాల్ చేయాలని, తక్షణమే సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఎలాంటి భయానికి లోనుకాకుండా ఉం డాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమర్ షాజహాన్ సుల్తానా, ఏఎస్ఐ విజయలక్ష్మి, వెంకటయ్య, ఉమాదేవి, వనిత, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ పోలింగ్‌కుఏ ర్పాట్లు సిద్ధం

- కొల్లాపూర్ రెవెన్యూ డివిజన్‌లో 67మంది ఓటర్లు

కొల్లాపూర్, మార్చి 26: ఉమ్మడి పాలమూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఈనెల 28న నిర్వహించనున్నారు. కొల్లాపూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొల్లాపూర్, కోడేరు, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి మండలాల పరిధిలో 67మంది ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎక్స్‌ఆఫీసియో సభ్యులు కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ పోలింగ్ ఉదయం 8గంటలకు ప్రారంభమై సాయంత్రం 4గంటల వరకు కొనసాగుతుందని స్థానిక ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి శ్రీకాంత్ తెలిపారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ ఉప ఎన్నికల బరిలో బీఆర్ఎస్ అభ్యర్థిగా నవీన్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి మన్నెం జీవన్‌రెడ్డి తలపడుతున్నారు. అయితే కాంగ్రెస్ నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన ఓటర్లను మైసూర్‌కు, బీఆర్ఎస్ ప్రతినిధులను గోవా క్యాంపునకు తరలించారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పావులు కదుపుతూ వ్యూహం, ప్రతివ్యూహంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య రాజకీయాలు వేడెక్కుతున్నాయని ఆయా పార్టీల నాయకులు చెబుతున్నారు. ఏప్రిల్ 2న జరుగనున్న ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల రాజకీయ భవితవ్యం తేలనున్నది.


ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ జరుగనున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

## ఘర్షణకు దారితీసిన షార్ట్ ఫిలీం షూటింగ్

లింగాల, మార్చి 26: స్థానిక ఎస్టీ బాలుర వసతిగృహంలో షార్ట్ ఫిలీం షూటింగ్ నిర్వహిస్తుండగా సోమవారం రాత్రి వివాదాస్పదంగా మారింది. వసతి గృహంలో షూటింగ్ మొదలు పెట్టాక, వారిలో ఓ వ్యక్తి సన్నివేశంతో పాటు ఫొటోలు తీస్తుండగా వసతి గృహానికి చెందిన ఓ ఉద్యోగి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలోనే ఆ ఉద్యోగిని చితకబాదారు. ఈ ఘటనపై వసతి గృహ వార్డెన్ తిరుపతయ్యను వివరణ కోరగా, వసతిగృహంలో షూటింగ్ తీస్తామని, కొందరు వ్యక్తులు చాలారోజులుగా అడుగుతూ వస్తున్నారని, అందుకే అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. కాగా ఘర్షణ చోటు చేసుకోవడం అనుకోని సంఘటన అని, దీనిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తామన్నారు.

## విద్యుత్ మోటర్ల వైర్లు చోరీ

కోడేరు, మార్చి 26: మండలంలోని పసుపుల, ఎత్తం గ్రామ శివారులో, గ్రామాల్లోని 21మంది విద్యుత్ మోటర్ల రాగి వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై కురుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. పసుపుల శివారులో పెద్దకొత్తపల్లి మండలం దేవుని తిర్మాలాపూర్‌కు చెందిన ఏడుగురు రైతులు కేఎల్ఐ కాల్వలో సాగునీటి సరఫరా కోసం విద్యుత్ మోటర్లు ఏర్పాటు చేసుకున్నారు. వాటి నుంచి రాగివైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. అలాగే ఎత్తం గ్రామ శివారులోని బీమా కాల్వలో 14మంది రైతుల విద్యుత్ మోటర్ల కాపర్ వైర్లను దొంగిలించారు. ఈ విషయంపై ఆయా గ్రామాల రైతులు కోడేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## పేద ఆర్యవైశ్యుల అభివృద్ధే మా లక్ష్యం

అమ్రాబాద్, మార్చి 26: రాష్ట్రంలో పేద ఆర్యవైశ్యులను అన్నివిధాలా ఆదుకుంటామని ఆర్యవైశ్యమహాసభ జిల్లాఅధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. మంగళవారం శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకొని తిరుగు ప్రయాణంలో మన్ననూర్‌లో విలేకరులతో మాట్లాడారు. పేదఆర్యవైశ్యులకు అండగా ఉంటామని, విద్య, వైద్య, ఆర్థికంగా ఆదుకుంటానని చెప్పారు. వడ్డీలేని రుణాలు అందిస్తామన్నారు. మొల్కమామిడిలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయిన బీద ఆర్యవైశ్యునికి ఇంటిమరమ్మతుకు రూ.లక్ష ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటరమణ, మాజీ వైస్ ఎంపీపీ శోభ పాల్గొన్నారు.


మన్ననూర్‌లో మాట్లాడుతున్నరా మకృష్ణ

## 8 మంది గైర్హాజరు

కల్వకుర్తి రూరల్, మార్చి 26 : కల్వకుర్తి పట్టణం, మండలంలో గురువారం పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. మంగళవారం పట్టణంలో ప్రభుత్వ ఉన్నత, జెడ్పీబాలికల ఉన్నత, జెడ్పీ బాలుర ఉన్నత, జేపీనగర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, మహాత్మాజ్యోతిబా పూలే బీసీబాలికల వికాస్, శ్రీ చైతన్య, నిర్మల పాఠశాలలతో పాటు మండలంలోని మార్చాలలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఫిజిక్స్ పరీక్షకు 1741మందికి గానూ 8 గైర్హాజరుకాగా 1,733 విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో బాసూనాయక్ పేర్కొన్నారు.

## భూ సమస్యలు పరిష్కరించాలి

వెల్దండ, మార్చి 26 : రైతులు భూ సమస్యలకు ఇచ్చిన వినతులు పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని తాసీల్దార్ రవికుమార్ అన్నారు. మంగళవారం ఆయన చాంబర్‌లో కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, ఆర్ఐలు శైలజ, శంకర్, సిబ్బంది అనిత, గణేశ్, దయాకర్, వంశీ తదితరులున్నారు.

## విద్యార్థులకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అమ్రాబాద్, మార్చి 26: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల సుసంపన్నం (స్టూడెంట్ ఎన్రిచ్మెంట్) కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలపై విద్యార్థులకు సమగ్ర సామర్థ్యాలను పెంపొందించే పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ మాట్లాడుతూ సమకాలిన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తిరుపతయ్య, బాలకృష్ణ, కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## కూలీల శాతం పెంచాలి

లింగాల, మార్చి 26: జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల్లో కూలీల శాతం పెంచాలని ఎంపీడీవో ఆంజనేయులు చెప్పారు. మంగళవారం మగ్దూంపూర్ గ్రామ శివారులో చేపట్టిన ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ప్రతి రోజు కూలీల సంఖ్యను పెంచాలని, ఎండను దృష్టిలో ఉంచుకొని సకాలంలో పనులు పూర్తి చేసి కూలీలు ఇంటికి చేరుకోవాలన్నారు. పని ప్రదేశంలో తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. పనులు చేసిన వారం, పది రోజుల్లోనే డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీవో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత

తిమ్మాజిపేట, మార్చి 26 : మండలంలోని చేగుంట గ్రామానికి చెందిన గడ్డం దేవదాసు చనిపోవడంతో అదే గ్రామానికి చెం దిన ప్రముఖ వ్యాపారవేత్త మారేపల్లి సురేందర్‌రెడ్డి మంగళవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తన ఎమ్మెస్సార్ ట్రస్ట్ ద్వారా రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## గాలికుంటు నివారణ టీకాలు

తాడూరు, మార్చి 26: మండల పరిధిలోని పాపగల్‌లో మంగళవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు జేఈవో రమేశ్ తెలిపారు. ప్రస్తుతం పశువులకు గాలికుంటు వ్యాధి సోకుతున్నదని, ముందుజాగ్రత్తగా టీకాలు వేస్తున్నామన్నారు. రైతులు తమ పశువులకు టీకాలను వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రమేశ్, జ్ఞానయ్య, మల్లేశ్, మధు, ఈదమ్మ నిరంజన్ ఉన్నారు.

## బురుజు ధ్వంసంపై ఫిర్యాదు

తిమ్మాజిపేట, మార్చి 26: మండలంలోని ఎదిరేపల్లిలో శతాబ్దాల కాలం నాటి బురుజును ధ్వంసం చేశారని, గ్రామస్తులు మంగళవారం తాసీల్దార్, ఎంపీడీవోలకు ఫిర్యాదు చేశారు. ఓ వ్యక్తి పురాతన బురుజును కూలగొట్టారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి నాగమణి వివరణ కోరగా బురుజును దాదాపు 12ఏండ్ల కిందట కూలగొట్టారని తెలిపారు. ఎంపీడీవో లక్ష్మీదేవిని వివరణ కోరగా విచారణ చేస్తామన్నారు.

## పేదలకు దుస్తులు పంపిణీ

కల్వకుర్తి, మార్చి 26 : కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో సేకరించిన పాతదుస్తువులను మంగళవారం పేద పిల్లలకు పంపిణీ చేశారు. ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శర్వాణి తన ఇంట్లో ఉన్న 10 బస్తాల సరిపోయే పాతబట్టలను వివేకానంద సేవా బృందానికి అందజేశారు. పట్టణంలో పేదపిల్లలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చింటూ పాల్గొన్నారు.